www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

సంపుటి - 2 సంచిక -130 ఆదివారం 21 జూలై 2024 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు -6 వెల - 3/-

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,70306545

## 25న కేబినెట్ భేటీ



**అసెంబ్లీలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న తెలంగాణ ప్రభుత్వం**

**25న ఉదయం అసెంబ్లీ కమిటీ హాలులో కేబినెట్ భేటీ**

**వాస్తవిక అంచనాలతో బడ్జెట్‌ను రూపొందించాలని**

**ఆర్థిక శాఖకు ప్రభుత్వం సూచన**

**వంద శాతం వ్యయం లక్ష్యాన్ని సాధించేలా**

**బడ్జెట్ రూపకల్పన చేయాలన్న ప్రభుత్వం**

**హైదరాబాద్,జులై 20 ప్రజావినికిడి:** తెలంగాణ ప్రభుత్వం ఈ నెల 25న 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అసెంబ్లీలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. 25న ఉదయం 9 గంటలకు అసెంబ్లీ కమిటీ హాలులో రాష్ట్ర మంత్రివర్గం సమావేశమై ప్రతిపాదనలపై చర్చించి బడ్జెట్‌కు ఆమోదం తెలపనుంది. బడ్జెట్‌ను వాస్తవిక అంచనాలతో రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఆర్థిక శాఖకు సూచించింది. ఆదాయ, వ్యయాలపై భారీ అంచనాలతో కాకుండా ఎంతమేరకు ఆదాయం వస్తుందనేది పక్కాగా లెక్కలు వేసి అంతమేరకు కేటాయింపులతో రూపొందించాలని ప్రభుత్వం నిర్దేశించింది. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఒక్కసారి కూడా బడ్జెట్ అంచనాల ప్రకారం వంద శాతం వ్యయం చేయలేదని, ఈ ఏడాది ఆ లక్ష్యాన్ని సాధించేలా రూపకల్పన చేయాలని సూచించింది.గత పదేళ్లలో 2019-20లో మాత్రమే బడ్జెట్ అంచనాల్లో 97.5 శాతం వ్యయమైనట్లు శ్వేతపత్రంలో రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఈ ఏడాది రాష్ట్ర ఆదాయ, రుణాల సేకరణ పెరుగుతున్నందున బడ్జెట్ రూ.2.50 లక్షల కోట్ల వరకు చేరే అవకాశం కనిపిస్తోంది. ఈ నెల 23న కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెడుతోంది.

# 'రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం'

**సివిల్స్ ప్రిలిమ్స్ పాసైన వారి కోసం కొత్త పథకాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి**

- 'రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం' పథకాన్ని ప్రారంభించిన సీఎం
- సివిల్స్ ప్రిలిమ్స్ పాసైన అభ్యర్థులకు ఆర్థిక సాయం కోసం పథకం
- సింగరేణి సంస్థ ద్వారా ఆర్థిక సాయం




**హైదరాబాద్,జులై 20 ప్రజావినికిడి:**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం 'రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం' పథకాన్ని ప్రారంభించారు. సివిల్స్ ప్రిలిమ్స్ పాసైన రాష్ట్ర అభ్యర్థులకు ఆర్థిక సాయం అందించేందుకు ఈ కొత్త పథకాన్ని అందుబాటులోకి తీసుకు వచ్చారు. సింగరేణి సంస్థ ద్వారా ఆర్థిక సాయాన్ని అందించనున్నారు.ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, సింగరేణి సీఎండీ బలరాం పాల్గొన్నారు.అంతకుముందు, సివిల్స్ ప్రిలిమ్స్ పాసైన రాష్ట్ర అభ్యర్థులతో ముఖ్యమంత్రి ముఖాముఖి నిర్వహించారు. డీఎస్సీ పరీక్షలు ముగియగానే గ్రూప్ 2, 3 పరీక్షలు నిర్వహిస్తే తమకు ప్రిపేర్ కావడానికి సమయం లేకుండా ఉంటుందని అభ్యర్థులు విజ్ఞప్తి చేశారని, దీంతో డిసెంబర్ నెలకు వాయిదా వేసినట్లు చెప్పారు. తెలంగాణ యువత ఆశలను నెరవేర్చుతున్నామని చెప్పడానికే తాను, తన మంత్రులు.. కలిసి మీతో సమావేశమయ్యామన్నారు. సింగరేణి సంస్థ సహకారంతో రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగ నియామకాల కోసమే రాష్ట్రాన్ని సాధించుకున్నామన్నారు. విద్యార్థుల త్యాగాలతో రాష్ట్రం ఏర్పడిందన్నారు. 90 రోజుల్లో 30 వేల ఉద్యోగాలను భర్తీ చేసినట్లు చెప్పారు.

నిరుద్యోగుల బాధలు తమకు తెలుసునని... ఏళ్ల తరబడి వారు ప్రభుత్వ ఉద్యోగం కోసం ప్రిపేర్ అవుతున్నారన్నారు. అందుకే తాము అధికారంలోకి రాగానే ఉద్యోగ నోటిఫికేషన్లు ఇచ్చినట్లు చెప్పారు. టీజీపీఎస్‌ను పునర్వ్యవస్థీకరించినట్లు చెప్పారు. పరీక్షలు మాటిమాటికి వాయిదా వేయడం సరికాదన్నారు.

# అప్రజాస్వామిక పాలన

**బిఆర్ఎస్ ఎంఎల్ఎలను చేర్చుకోవడంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశాం: కెటిఆర్**



**విద్యార్థులపై అప్రజాస్వామికంగా దాడులు చేసి, కేసులు పెట్టారని ఆగ్రహం**

**ఉద్యమం సమయంలో ఉన్నటువంటి పరిస్థితులు ఉన్నాయని విమర్శ**

**జాబ్ క్యాలెండర్ ఎప్పుడు ఇస్తారో చెప్పాలని నిలదీత**

2లో.

## యూపీఎస్సీ చైర్మన్ మనోజ్ సోనీ రాజీనామా



2లో.

**వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేసినట్లు అధికార వర్గాల వెల్లడి**

**పూజా ఖేడ్కర్ వివాదానికి, సోనీ రాజీనామాకు సంబంధం లేదంటున్న అధికారులు**

**ఐదేళ్ల పదవీ కాలం ఉండగానే రాజీనామా**

## జాబ్ క్యాలెండర్ విషయమే మరిచిపోయారు



## : కిషన్ రెడ్డి

**నిరుద్యోగ భృతి ఇస్తామని కాంగ్రెస్ మోసం**

**వంద రోజుల్లో హామీలను ఎందుకు పూర్తి చేయలేదో చెప్పాలని నిలదీత**

**రాష్ట్రంలో జెండా మాత్రమే మారిందన్న కేంద్రమంత్రి**

**హైదరాబాద్,జులై 20 ప్రజావినికిడి:**

రేవంత్ రెడ్డి జాబ్ క్యాలెండర్ విషయమే మరిచిపోయారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని ధర్నా చౌక్‌లో బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన నిరుద్యోగ మహాధర్నాలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. ఇచ్చిన హామీలను విస్మరించారని ఆరోపించారు.కాంగ్రెస్ ప్రజావ్యతిరేకతను కూడగట్టుకుంటోందన్నారు. ఆ పార్టీకి ప్రజలందరూ స్వస్తి చెబుతారన్నారు. కాంగ్రెస్ నాయకులు ఎవరికి దొరికినంత వారు దోచుకుంటున్నారని అన్నారు. రాష్ట్రంలో చాలా అవినీతి జరుగుతోందన్నారు

మిగతా 2లో.

## హైదరాబాద్ అభివృద్ధిలో భాగస్వాములు అవ్వండి

2లో.

**కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ మహాసభలో రేవంత్ రెడ్డి**



## వాయుగుండం ప్రభావంతో

# విస్తారంగా వర్షాలు


**భారీ వర్షాలతో కృష్ణా, గోదావరి నదుల్లో వరద ఉధృతి,ప్రాజెక్టులకు భారీగా వచ్చి చేరుతున్న నీరు**

**పలు ప్రాంతాల్లో సింగరేణి బొగ్గు ఉత్పత్తికి అంతరాయం**

**పలు ప్రాంతాల్లో రాకపోకలకు తీవ్ర అంతరాయం**

**అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లకు సిఎస్ ఆదేశం**

3లో.



# రేవంత్ రెడ్డి జాబ్ క్యాలెండర్ విషయమే మరిచిపోయారు: కిషన్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

. ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లో ఎందుకు పూర్తి చేయలేదో చెప్పాలన్నారు. గతంలో ప్రజల తీర్పును కాలరాసి కేసీఆర్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలను చేర్చుకుంటే ఇప్పుడు కాంగ్రెస్ కూడా అదే పని చేస్తోందన్నారు.ప్రజావాణి వినిపించడంలో బీజేపీ కృషి చేస్తుందన్నారు. గ్రూప్ 1 మెయిన్స్‌కు 1:50 కాకుండా 1:100 నిష్పత్తిలో ఎంపిక చేయాలన్నారు. రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు గ్రూప్ 2లో 783 పోస్టులను 2000కు పెంచాలన్నారు. 1365 గ్రూప్ 3 పోస్టులను 3 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీ మేరకు 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. నిరుద్యోగులకు రూ.4 వేల భృతి ఇవ్వాలన్నారు.

# యూపీఎస్సీ చైర్మన్ మనోజ్ సోనీ రాజీనామా

**హైదరాబాద్,జులై 20 ప్రజావినికిడి:**
యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మనోజ్ సోనీ తన పదవికి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ప్రొబేషనరీ ఐఏఎస్ అధికారిణి పూజా ఖేడ్కర్ వివాదం వేళ ఆయన రాజీనామా ప్రాధాన్యతను సంతరించుకుంది. అయితే ఆమె వివాదానికి, మనోజ్ సోనీ రాజీనామాకు ఎలాంటి సంబంధం లేదని అధికార వర్గాలు వెల్లడించాయి.మనోజ్ సోనీ గత ఏడాది ఏప్రిల్ నెలలో బాధ్యతలు చేపట్టారు. ఇంకా అయిదేళ్ల పదవీ కాలం ఉండగానే అనూహ్యంగా రాజీనామా చేశారు. దాదాపు పదిహేను రోజుల క్రితమే ఆయన తన రాజీనామా లేఖను రాష్ట్రపతికి సమర్పించినట్లుగా అధికార వర్గాలు వెల్లడించాయి. అయితే దీనిని ఇంకా ఆమోదించలేదు. 2017లో యూపీఎస్సీ కమిషన్‌లో సభ్యుడిగా చేరిన ఆయన గత ఏడాది చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేశారు.
ఆయన పదవీకాలం 2029 మే 15 వరకు ఉంది. చైర్మన్ పదవిని చేపట్టేందుకు ఆయన ముందు నుంచీ సుముఖంగా లేరని, తనను ఈ బాధ్యతల నుంచి రిలీవ్ చేయాలని గతంలోనే ఓసారి అభ్యర్థించినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలని ఆయన కోరుకుంటున్నట్లుగా చెబుతున్నారు. యూపీఎస్సీ చైర్మన్ కంటే ముందు ఆయన గుజరాత్‌లోని బాబా సాహెబ్ అంబేద్కర్ ఓపెన్ వర్సిటీకి రెండుసార్లు వీసీగా సేవలు అందించారు.


# అప్రజాస్వామిక పాలన

## బిఆర్ఎస్ ఎంఎల్ఎలను చేర్చుకోవడంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశాం: కెటిఆర్

**హైదరాబాద్,జులై 20 ప్రజావినికిడి:**
నిరుద్యోగులపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం కక్ష కట్టిందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎంఎల్ఎ కెటిఆర్ విమర్శలు గుప్పించారు. కెటిఆర్ ఆధ్వరంలో బిఆర్ఎస్ ఎంఎల్ఎలు గవర్నర్ సిపి రాధాకృష్ణన్ ను కలిశారు. పార్టీ ఫిరాయింపులు, నిరుద్యోగుల అంశంపై గవర్నర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కెటిఆర్ మీడియాతో మాట్లాడారు. అప్రజాస్వామికంగా విద్యార్థులపై దాడులు, కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడంలేదని గవర్నర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఉద్యమ సమయంలో ఉన్న పరిస్థితులు ఇప్పుడు ఉన్నాయని, గ్రంథాలయాల్లో చదువుతున్న విద్యార్థుల పట్ల దౌర్జన్యంగా వ్యవహరించారని, అక్రమంగా బిఆర్ఎస్ ఎంఎల్ఎలను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకుంటున్నారని కెటిఆర్ ధ్వజమెత్తారు. ఎంఎల్ఎలను చేర్చుకోవడంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశామని, ఫిరాయింపుపై న్యాయ ప్రక్రియ నడుస్తుందని గవర్నర్‌కు తెలిపామన్నారు. వెంటనే గవర్నర్ స్పందించి, ఫిరాయింపులపై రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాస్తామని చెప్పారన్నారు. మేడిగడ్డ కొట్టుకుపోయిందని, కాళేశ్వరంలో లక్ష కోట్లు గంగపాలు అయ్యిందంటూ చిల్లర ప్రచారం చేసిన కాంగ్రెస్ ఇప్పుడు సిగ్గుతో తలదించుకోవాలన్నారు. అక్కడ జరిగిన చిన్న విషయంపై తప్పుడు ప్రచారం చేశారని దుయ్యబట్టారు. కొన్ని రోజుల్లోనే రిపేర్లు పూర్తి చేశారని, ఇప్పుడు వరదలాగ నీళ్లు వస్తున్న మేడిగడ్డ తట్టుకోవటమంటే అదే కాళేశ్వరం గొప్పతనమని ప్రశంసించారు. త్వరలోనే మేడిగడ్డను సందర్శిస్తామని ప్రజలకు వాస్తవాలను వివరిస్తామని కెటిఆర్ స్పష్టం చేశారు. పరీక్షలు వాయిదా వేస్తే కోచింగ్ సెంటర్లకు వందల కోట్లు లాభం వస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారని, ఇప్పుడు నాలుగు నెలలు వాయిదా వేశారని, ఇప్పుడు నాలుగు వందల కోట్లు లాభాలు వస్తున్నాయా? అని ప్రశ్నించడంతో పాటు అందులో సిఎం వాటా ఎంత? అని అడిగారు.

# భద్రాచలం వద్ద 30 అడుగులు దాటిన గోదావరి నీటిమట్టం

## 43 అడుగులకు చేరితే మొదటి ప్రమాద హెచ్చరిక జారీ



**హైదరాబాద్,జులై 20 ప్రజావినికిడి:**
రెండు రోజులుగా భారీగా కురుస్తున్న వర్షాలకు భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ప్రస్తుతం ఇది 30.5 అడుగులకు చేరుకుంది. చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఎగువన ఛత్తీస్‌గఢ్‌లో కురుస్తున్న భారీ వర్షాలకు తాలిపేరు ప్రాజెక్టు జలాశయానికి వరద పోటెత్తింది. శనివారం ఉదయం ప్రాజెక్టు 20 గేట్లను ఎత్తి 66 వేల 900 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేశారు. 43 అడుగులకు చేరితే మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేస్తారు.గద్వాల జిల్లా జూరాల ప్రాజెక్టుకు వరద నీరు పెరుగుతోంది. అధికారులు 5 గేట్లను ఎత్తారు. ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 70 వేలు, ఔట్ ఫ్లో 32,267 క్యూసెక్కులుగా ఉంది. నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాం సాగర్ ప్రాజెక్టులోకి 18,275 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1091 అడుగులు కాగా, 1066 అడుగులకు చేరుకుంది. భారీ వర్షాలతో తెలంగాణలోని చెరువులు నిండుకుండలా కనిపిస్తున్నాయి.

# నకిలీ నోట్ల ముఠా గుట్టు రట్టు..!

# నలుగురు అరెస్ట్

**రూ. 7లక్షల 95 వేల ఫేక్ కరెన్సీ స్వాదీనం   వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి**




వికారాబాద్ **జులై 20 ప్రజావినికిడి:**
వికారాబాద్, జిల్లాలో కలకలం సృష్టించిన నకిలీ నోట్ల మిస్టరిని జిల్లా పోలీసులు చేధించారు. జిల్లాలోని తాండూరులో గత కొన్ని రోజులుగా నకిలీ నోట్ల చెలామణిపై పుకార్లు జోరందుకున్నాయి. దీంతో ప్రత్యేక నిఘా ఉంచిన పోలీసులు బండల వ్యాపారిని అదుపులోకి తీసుకోవడంతో ముఠా డొంక మొత్తం కదిలింది. నలుగురు నిందితులను అదపులోకి తీసుకుని ముఠా సభ్యుల నుంచి రూ. 7లక్షల 95వేల నగదు, కంప్యూటర్, ప్రింటర్, పేపర్లు, రిబ్బన్, 5 మొబైల్ ఫోన్లను స్వాదీనం చేసుకున్నారు. శనివారం వికారాబాద్ జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి కేసు వివరాలను వెల్లడించారు.తాండూరు నియోజకవర్గంలోని బషీరాబాద్ మండలం ఇందర్ చెడ్ గ్రామానికి చెందిన మండిగి చంద్రయ్య అలిలాస్ చంద్రప్ప తాండూరు పట్టణం అయ్యప్ప నగర్‌లో నివాసం ఉంటున్నారు. బండల వ్యాపారం చేసే చంద్రప్ప ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయనగరం జిల్లా సుంకరిపేటకు చెందిన బ్యాంక్ ఆఫ్ బరోడా మాజీ మేనేజర్ ఇచ్ఛాపురం జగదీష్, కోనసీమ జిల్లా రాంచంద్రపురం మండలం నరసారావుపేటకు చెందిన బడుగంటి వీర వెంకట రమణ అలియాస్ వెంకీ, తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడి మండలంకు చెందిన ప్రగల్లపాటి శివకుమార్‌లతో కలిసి నకిలీ నోట్ల తయారి ముఠాగా ఏర్పడ్డారు.మేడ్చల్ జిల్లా మల్కాజ్ గిరి జిల్లా దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధి మల్లంపేటలోని ఎస్ఆర్ఎస్ వృషభాద్రి అపార్ట్ మెంట్ లో కంప్యూటర్ మానిటర్, సీపీయూ, కలర్ ప్రింటర్, రిబ్బన్ తదితర వస్తువులతో నకిలీ నోట్లను తయారు చేసి చెలామణి చేయిస్తున్నారు. శుక్రవారం తాండూరు పట్టణంలో చంద్రయ్యను స్థానిక పోలీసులు అనుమానంతో అదుపులోకి తీసుకోగా గుట్టు రట్టయ్యింది. చంద్రయ్యతో పాటు అపార్ట్‌మెంట్‌లో రూ. 7లక్షల 95వేల ఫేక్ కరెన్సీ, కంప్యూటర్, సామాగ్రి, 5 సెల్ ఫోన్లను స్వాదీనం చేసుకున్నారు.

# హైదరాబాద్ అభివృద్ధిలో భాగస్వాములు అవ్వండి

## కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ మహాసభలో రేవంత్ రెడ్డి




**హైదరాబాద్,జులై 20 ప్రజావినికిడి:**
రాజకీయాలు, లీడర్‌షిప్‌లో ఎన్టీఆర్ ఒక బ్రాండ్ అని... తాను ఈ స్థాయిలో ఉన్నానంటే ఆయన కూడా ఒక కారణమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ మహాసభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్టీఆర్ తెచ్చిన సంకీర్ణ రాజకీయాలే ఈనాడు దేశాన్ని ఏలుతున్నాయన్నారు.
ఈ దేశంలో ఇందిరా గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీకి ఎదురే లేదు అనుకున్న సమయంలో ఎన్టీఆర్ సంకీర్ణ రాజకీయాలను తీసుకువచ్చారన్నారు. ఈ రోజు దేశాన్ని ఏలుతున్న వారికి అవకాశం ఇచ్చింది నాడు ఎన్టీఆర్ తెచ్చిన సంకీర్ణ రాజకీయాల వల్లనే అన్నారు. నాడు టీడీపీ, జనతా పార్టీ సంకీర్ణం ఏర్పడిందన్నారు. ఆ రోజు జనతా పార్టీ గెలిచింది రెండే సీట్లు అని, ఒకటి గుజరాత్‌లో అయితే రెండోది ఎన్టీఆర్ మద్దతుతో హన్మకొండ అన్నారు. ఎన్టీఆర్ సంకీర్ణ రాజకీయాల ఆలోచనతోనే ఇప్పుడు అధికారంలో ఉన్నారని బీజేపీని ఉద్దేశించి అన్నారు. కమ్మవారితో తనకు ఉన్న సన్నిహిత సంబంధాల గురించి తాను పెద్దగా చెప్పాల్సిన పని లేదన్నారు. యరపతినేని మాటలు వింటే కమ్మవారు తనను ఎంతగా అభిమానిస్తారో తెలిసిపోతుందన్నారు. తాను ఎన్టీఆర్ లైబ్రరీలో చదువుకున్నానని... తాను ఉన్నతస్థానానికి రావడానికి అది ఎంతో ఉపయోగపడిందని గుర్తు చేసుకున్నారు. అనర్గళంగా మాట్లాడటం ఎన్టీఆర్ నుంచే నేర్చుకున్నట్లు చెప్పారు. ఈ మాట అందరి ముందు చెప్పడానికి కూడా తాను సంకోచించడం లేదన్నారు. మనకు అవకాశం ఇచ్చిన వారిని... అవకాశం వచ్చిన నేపథ్యాన్ని తక్కువ చేసి మాట్లాడకూడదని సీఎం అన్నారు.
ఎన్టీఆర్ కంటే ముందు 52 మంది కమ్మవారు ఎమ్మెల్యేలుగా ఉండేవారని చెబుతున్నారని, కానీ ఎన్టీఆర్ వచ్చాక ఆయన ఒక బ్రాండ్ అయ్యారని తెలిపారు. ఆయన ఇచ్చిన అవకాశాలతో ఏపీ, తెలంగాణలలో ఎంతోమంది రాజకీయ నాయకులుగా ఎదిగారని, ఇప్పుడు అన్ని పార్టీలలోనూ ఆయన అవకాశం ఇచ్చిన వారు ఉన్నారని తెలిపారు. ఈరోజు ఎన్టీఆర్‌ను విమర్శించేవారు... ప్రశంసించేవారు... అందరికీ ఆయనే అవకాశం ఇచ్చారన్నారు.
ఎన్టీఆర్‌తో పాటు ఎన్జీరంగా, వెంకయ్యనాయుడు, ఈరోజు చంద్రబాబు గురించి తాను ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదన్నారు. కమ్మ అంటే అమ్మలాంటి వాళ్లని ప్రశంసించారు. మట్టిని నమ్ముకొని పని చేసి పదిమందికి సాయం చేసే కులం కమ్మకులం అన్నారు. ఎక్కడైతే సారవంతమైన నేల ఉంటుందో... సమృద్ధిగా నీరు ఉంటుందో అక్కడ కమ్మవారు ఉంటారని చెప్పవచ్చునన్నారు. కమ్మవారు మట్టి నుంచి బంగారం తీయగలిగే శక్తి కలిగి ఉన్నారన్నారు. కమ్మలు వాళ్ల తాతలు... ముత్తాతల వలె పదిమందికి సాయం చేయాలని ఆయన సూచించారు. ఉన్న ఊరును, భూమిని మరిచిపోవద్దని సూచించారు. సహాయం చేయడం మీ డీఎన్ఏ అని, అది మీ సహజ లక్షణమని, దానిని మరిచిపోవద్దని సూచించారు. కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, ఏపీతో అంతటా కమ్మవారు విస్తరించారన్నారు.అమరావతి నుంచి సిలికాన్ వ్యాలీ వరకు కమ్మవారి కృషిని ఎవరూ కాదనలేరన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఎవరి పైనా వివక్ష ఉండదని హామీ ఇచ్చారు. హైదరాబాద్ అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌ను విశ్వనగరంగా మార్చే ప్రక్రియలో మీరూ భాగస్వాములు కావాలన్నారు.

# పాఠశాలల వేళలను మారుస్తూ తెలంగాణ విద్యాశాఖ ఉత్తర్వులు



**హైదరాబాద్,జులై 20 ప్రజావినికిడి:**
పాఠశాలల వేళలను మారుస్తూ తెలంగాణ విద్యాశాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రాథమిక పాఠశాలల సమయానికి అనుగుణంగా ఉన్నత పాఠశాలల్లో సమయాలను మార్పు చేసింది. ఉన్నత పాఠశాల సమయాన్ని ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు మారుస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇప్పటి వరకు 9.30 గంటల నుంచి సాయంత్రం 4.45 వరకు పనివేళలు ఉండేవి. ఇప్పుడు ఉదయం అరగంట సమయాన్ని ముందుకు జరిపి, సాయంత్రం కూడా ముందుకు జరిపింది. అయితే, హైదరాబాద్, సికింద్రాబాద్‌లలో ట్రాఫిక్ సమస్యను దృష్టిలో పెట్టుకొని ఇప్పటికే అమలులో ఉన్న పని వేళలు కొనసాగుతాయని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇక్కడ పాఠశాలలు ఉదయం 8.45 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగనున్నాయి.

# నవీన్ "పాలమూరు" ను జాగ్రత్తగా చూసుకో..

**-పాలమూరు భవిష్యత్ నాయకుడివి నీవే.. - టిఆర్ఎస్ తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్..**

**- మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి గురించి కేటీఆర్ కీలక వ్యాఖ్యలు..**





ప్రజావినికిడి,(షాద్ నగర్):

నవీన్ పాలమూరును జాగ్రత్తగా చూసుకో.. ప్రస్తుతానికి ఉమ్మడి పాలమూరు జిల్లాలో నువ్వు బీఆర్ఎస్ ఆశాకిరణం నీకు మంచి భవిష్యత్తు ఉంటుంది అంటూ టిఆర్ఎస్ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. శనివారం గవర్నర్ ను కలిసే క్రమంలో మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి గొడుగు తీసుకుని వర్షానికి అడ్డంగా కేటీఆర్ కోసం పట్టుకున్నారు. నవీన్ ను చూడగానే కేటీఆర్ ఈ విధంగా స్పందించారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్రజా ప్రతినిధిగా నీ ప్రస్థానం కొనసాగించాలని..

పాలమూరును జాగ్రత్తగా చూసుకోవాలని కార్యకర్తలకు అండగా నిలబడాలనీ ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డిని కోరారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.ఆర్.ఎస్ అధినేత ఈ మాట చెప్పగానే నవీన్ కుమార్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఏ బాధ్యతలు పెట్టిన తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని కార్యకర్తలకు అండగా నిలబడతానంటూ సమాధానం ఇచ్చారు.



# రైతు రుణమాఫీతో రైతుల కళ్ళల్లో ఆనందం..

**రైతుకి ఇచ్చిన మాట కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుంది..**

**ప్రజలందరికీ గురు పౌర్ణమి శుభాకాంక్షలు..**

**అబ్దుల్లాపూర్ మెట్టు మాజీ ఎంపీటీసీ టు తాటిపల్లి సౌమ్య రమేష్ గౌడ్..**



ప్రజావినికిడి,(అబ్దుల్లాపూర్):

అబ్దుల్లాపూర్ మెట్టు మండలం: రైతు రుణమాఫీ గొప్ప చరిత్రత్మక నిర్ణయమని అబ్దుల్లాపూర్మెట్ మాజీ ఎంపిటిసి 2 తాటిపల్లి సౌమ్య రమేష్ గౌడ్ అన్నారు రైతుల రుణమాఫీతో రైతు కళ్ళల్లో ఆనందం కలిగిందని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం రైతుల రుణమాఫీ చేసిందని ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి కృషితో రైతులు సంతోషంగా ఉన్నారని దేశానికే వెన్నుముక రైతన్న అని కొనియాడారు కాంగ్రెస్ ప్రభుత్వం రైతన్నలకు ఎల్లప్పుడూ తోడు ఉంటుందని ఎన్నికలలో ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో ఫ్రీ బస్సు అమలవుతుందని గ్యాస్ సిలిండర్ 500 రూపాయలకే ఇస్తున్నారని 200 యూనిట్ కరెంటు ఫ్రీగా ఇస్తున్నామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట నిలబెట్టుకుంటుందని రైతు పక్షపాతి మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని లక్ష రూపాయల రుణమాఫీతో రైతులు సంతోషంగా ఉన్నారని ఆగస్టు 15 లోపు రెండు లక్షల రూపాయల రైతు రుణమాఫీ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని అన్నారు రాబోయే స్థానిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని అబ్దుల్లాపూర్మెట్ మాజీ ఎంపిటిసి టు తాటిపల్లి సౌమ్య రమేష్ గౌడ్ తెలిపారు.

# సనత్ నగర్ ఇన్స్పెక్టర్ పురెందర్ రెడ్డి సస్పెండ్..




ప్రజావినికిడి,(హైదరాబాద్):

ఇన్స్పెక్టర్ పురెందర్ రెడ్డి నిసస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన సైబరాబాద్ సిపి..

పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేసిన మహిళ పట్ల అసభ్య చాటింగ్ సైబరబాద్ సిపిను ఆశ్రయించిన బాధితురాలు సిఐ చేసిన చాటింగ్ సీపికి చూపించిన బాధితురాలు

అందంగా ఉన్నావు, చెప్పిన ప్లేస్ కి రావాలి అంటూ సిఐ మేసేజ్ లు..

# మీర్పేట్ గడ్డ బీఆర్ఎస్ అడ్డ..

**అధికార పార్టీల ఎత్తులను చిత్తు చేసిన బిఆర్ఎస్ పార్టీ..**

**మేయర్ అయినా,డిప్యూటీ మేయర్ అయినా కిక్ బాక్సింగ్ గ్రౌండ్లో గెలిచేది బిఆర్ఎస్ పార్టీ నే..**





(మహేశ్వరం):జులై 20 జర్నలిస్టు జర్నీ న్యూస్: ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన అధికార పక్షాలు.. ఇది అధికార పక్షాలకు చెంపపెట్టు లాంటిది. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లో నిన్న జరిగిన డిప్యూటీ మేయర్ అవిశ్వాస తీర్మానంలో విజయం సాధించిన మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు అర్కల కామేష్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం రోజు తెలంగాణ భవన్లో ప్రస్తుత శాసనసభ్యులు కేటీఆర్ ని, శ్రీమతి పి సబితా ఇంద్రా రెడ్డిని మర్యాదపూర్వక కలిసి డిప్యూటీ మేయర్ పై అవిశ్వాస తీర్మానము ప్రవేశపెట్టిన అధికార పార్టీ పన్నిన కుట్రలు ను చేదించి విజయం సాధించామని వివరించడం జరిగినది. ఈ సందర్భంగా మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ నాయకులకు కార్యకర్తలకు గౌరవ కేటీఆర్,సబితా ఇంద్రారెడ్డి ఇరువురు అభినందించి ప్రత్యేక ధన్యవాదాలు, శుభాకాంక్షలు తెలియజేశారు. మాజీ మంత్రివర్యులు, ప్రస్తుత శాసనసభ్యులు కేటీఆర్ ని,సబితా ఇంద్రారెడ్డిని కలిసిన కార్పొరేటర్లు బొక్క రాజేందర్రెడ్డి, సిద్దాల లావణ్య, బీరప్ప,సిద్ధలపద్మా అంజయ్య,రేఖ లక్ష్మణ్ ముదిరాజ్ మరియు పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రపతి భవన్ ను సందర్శించిన ఏడెల్లి అజయ్ కుమార్ కుటుంబ సభ్యులు..





ప్రజావినికిడి,(అంబర్ పేట):

జూలై 20,ఉత్తర భారత దేశ పర్యటనలో భాగంగా సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బిజెపి సంయుక్త కన్వీనర్ ఏడెల్లి అజయ్ కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి ఉత్తర భారత దేశంలోని వివిధ చారిత్రాత్మక ప్రదేశాలను పుణ్యక్షేత్రాలను సందర్శించడం జరిగింది. అందులో భాగంగా దేశ రాజధాని ఢిల్లీలోనీ రాష్ట్రపతిభవన్ ని సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రపతి భవన్ ను సందర్శించి ఇప్పటివరకు రాష్ట్రపతులుగా పని చేసిన వారి ఫోటో గ్యాలరీని వీక్షించారు. ఇదిలా ఉండగా మన రాష్ట్రానికి చెందిన సీనియర్ రాజకీయ నాయకులు, అందరివాడు గవర్నర్ దత్తాత్రేయను హర్యానాలోని రాజ్ భవన్ లో కుటుంబ సభ్యులతో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బిజెపి సంయుక్త కన్వీనర్ ఏడెల్లి అజయ్ కుమార్ కుటుంబ సభ్యులతో ఉత్తరాది పర్యటనలో భాగంగా కలిసి విడిది చేసిన విషయం తెలిసిందే.

# వాయుగుండం ప్రభావంతో విస్తారంగా వర్షాలు

**%భారీ వర్షాలతో కృష్ణా, గోదావరి నదుల్లో వరద ఉధృతిప్రాజెక్టులకు భారీగా వచ్చి చేరుతున్న నీరు**

**పలు ప్రాంతాల్లో సింగరేణి బోగ్గు ఉత్పత్తికి అంతరాయం పలు ప్రాంతాల్లో రాకపోకలకు తీవ్ర అంతరాయం**

**అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లకు సిఎస్ ఆదేశం**



**హైదరాబాద్,జులై 20 ప్రజావినికిడి:**పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండం తీరం వైపునకు కదులుతోంది. పూరీ తీరానికి 40 కిలో టర్ల దూరంలో వాయుగుండం కేంద్రకృతమైందని వాతావరణ అధికారులు వెల్లడించారు. ఒడిశా-ఛత్తీస్ గఢ్ మధ్య తీరం దాటే అవకాశం ఉందని వెల్లడించారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఉత్తర తెలంగాణలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. మరోవైపు ఇప్పటికే తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో కృష్ణా, గోదావరి నదుల్లో వరద ఉధృతి పెరుగుతూ వస్తోంది. తెలంగాణలోని పలు జిల్లాల్లో కుండపోత వర్షాలు కురవడంతో వాగులు వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. ప్రాణహిత నది వరద ప్రమాద స్థాయిని దాటి ప్రవాహిస్తోంది. భద్రాచలం వద్ద గోదావరి నది నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. గోదావరి వద్ద నీటమట్టం 30.5 అడుగులకు చేరుకోవడంతో మూడో ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు. చర్లలోని తాలిపేరు ప్రాజెక్టు 20 గేట్లు ఎత్తి 66900 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేశారు. నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి 18,275 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. శ్రీరాంసాగర్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091 అడుగులుకాగా ప్రస్తుతం 1066 అడుగుల వరకు నీరు చేరింది. ఎడతెరిపి లేకుండా కురుస్తోన్న కుండపోత వానలకు వాగులు, వంకలు పొంగిపొర్లు తున్నాయి. ప్రాజెక్టులు నిండు కుండలా మారాయి. నిన్న రాత్రి నుంచి వర్షం కురుస్తోనే ఉంది. అయితే ఈ వారాంతంలో తెలంగాణ రికార్డు వర్షపాతాన్ని నమోదు చేసింది. రెండ్రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణశాఖ అధికారులు హెచ్చరించారు. వాయుగుండం ప్రభావంతో రాష్ట్రంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ప్రధానంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఆదిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి, నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, కరీనంగర్, భూపాలపల్లి జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. రాబోయే 18 గంటల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. భారీ వర్షాలపై వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. ఈ 11 జిల్లాల కలెక్టరేట్లలో కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేయాలని, పోలీస్ తదితర శాఖల అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించాలన్నారు. ఏ విధమైన సహాయం కావాలన్న రాష్ట్ర రాజధానికి ఏ సమయంలోనైనా సంప్రదించవచ్చునని ఆమె అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పెద్ద వాగుకు వచ్చిన ఆకస్మిక వరదల వల్ల చిక్కుకుపోయిన దాదాపు 40 మందికి ఏవిధమైన అపాయం జరుగకుండా వివిధ శాఖల సమన్వయంతో కాపాడినందుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ ను శాంతి కుమారి అభినందించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ములుగు జిల్లా వెంకటాపురం మండలం ఆలుబాకలో బానరి రాజు అనే వ్యక్తి వాగులో చేపల వేటకు వెళ్లి గల్లంతైనట్లు తెలుస్తోంది.

# మంచినీటి సరఫరాలో కాలుష్యం కార్పొరేటర్ పరిశీలన...



ప్రజావినికిడి,(బోరబండ):జూలై 21, మంచినీటి సరఫరాలో కాలుష్యనీరు కలిసిందన్న సమాచారం తెలిసిన వెంటనే బోరబండ కార్పొరేటర్ ఎండి బాబా ఫసియుద్దీన్ ఎన్ ఆర్ పురం సైట్ 1 కాలనీలో ఇంటింటికి వెళ్లి జలమండలి అధికారులతో కలిసి పరిశీలించడం జరిగింది. బోరబండ డివిజన్ ఎన్ ఆర్ ఆర్ పురం,సైట్ వన్ కాలనీలో మంచినీటి సరఫరాలో కాలుష్యనీరు కలిసింది అన్న సమాచారం తెలియదని సంబంధిత అధికారులతో కలిసి ఇంటింటికి తిరిగి పరిశీలించి క్లోరిన్ టాబ్లెట్స్ చల్లడం జరిగింది. అనంతరం బోరబండ ప్రధాన రహదారిలో గల నాలాని జిహెచ్ఎంసి అధికారులతో పరిశీలించి అధికారులతో మాట్లాడి సమస్య గురించి తెలియజేశారు. అనంతరం మంచినీటి ట్యాంకర్లను తెప్పించి సరఫరా చేయించారు. అనంతరం బాబా మాట్లాడుతూ, మాట్లాడుతూ వర్షాకాల శిక్ష అధికారులందరూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ పర్యటనలో జలమండలి మేనేజర్ శ్రీనివాస్,జిహెచ్ఎంసి ఏఈ భరత్ ఎస్.ఎఫ్.ఏలు మరియు మాన్సూన్ టీం తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగులను మోసం చేసిన కాంగ్రెస్ సర్కార్..

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి..

న్యాయమైన డిమాండ్లను నెరవేర్చే వరకు బీజేవైఎం పోరాటం చేస్తుంది..

బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శిప్యాట అశోక్..



## బీజేవైఎం నిర్వహిస్తున్న మహా ధర్నాకు యువమోర్చ నాయకులతో కలిసి జండా ఊపి బయలుదేరిన శ్రీవర్ధన్ రెడ్డి

ప్రజావినికిడి,(షాద్ నగర్):

నిరుద్యోగ యువతకు ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చుమని ఆందోళన చేసిన బీజేవైఎం కార్యకర్తలపై కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరిని నిరసిస్తూ ఈరోజు ధర్నా చౌక్ దగ్గర బీజేవైఎం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహా ధర్నా కార్యక్రమానికి షాద్ నగర్ నియోజకవర్గం నుండి బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి ప్యాట అశోక్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బీజేవైఎం నాయకులు బయలుదేరడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి గా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి పాల్గొని జండా ఊపి,బీజేవైఎం నాయకులతో కలిసి ధర్నాకు బయలుదేరారు. వారితో పాటు రణధీర్ గౌడ్,బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ పుట్నాల సాయి కుమార్,సందీప్ యాదవ్,ఉదయ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డి డిక్లరేషన్ అమలు చెయ్యాలి...

## మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి తెలంగాణా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల నరేందర్ గౌడ్ విజ్ఞప్తి...



ప్రజావినికిడి,(హైదరాబాద్):జులై 20, కామారెడ్డి డిక్లరేషన్ అమలు చెయ్యాలని తెలంగాణ రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డిని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు మేకపోతుల నరేందర్ గౌడ్ మరియు బీసీ ప్రతినిధుల బృందం కలిసి విజ్ఞప్తి చేసింది. హైదరాబాద్ బంజారా హిల్స్ లో అయన ఇంటి వద్ద మేకపోతుల నరేందర్ గౌడ్ బృందం ఈ మేరకు కలిసి విజ్ఞప్తి చేసింది. కామారెడ్డి డిక్లరేషన్ అమలు చెయ్యాలని కోరారు. గత ప్రభుత్వం ఒంటెద్దు పోకడల విధానాల వలన బీసీలు స్థానిక సంస్థలలో ప్రాతినిధ్యాన్ని భారీగా నష్టపోయారని మంత్రికి వివరించారు. కాంగ్రెస్ పార్టీ ఎలక్షన్ మ్యానిఫెస్టోలో బీసీల అభ్యున్నతి కోసం రాహుల్ గాంధీ అభీష్టం మేరకు, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర కులగనణ జరిపించి బీసీలకు స్థానిక సంస్థలలో 42% రిజర్వేషన్స్ కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా సివిల్స్ కన్స్ట్రక్షన్ లో మరియు మెంటేనేన్స్ లో 42% రిజర్వేషన్లు కల్పిస్తామని కామారెడ్డి డిక్లరేషన్ పేరుతో దేశం గర్వించదగ్గ సీనియర్ బీసీ నాయకులు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దారమయ్య చేతులమీదుగా విడుదల చేసారని గుర్తు చేశారు. కామారెడ్డి డిక్లరేషన్ ను ప్రతిష్టాత్మకంగా తీసుకొని బీసీలకు రిజర్వేషన్లను తూచా తప్పకుండా అమలు చేయాలని మేకపోతుల నరేందర్ గౌడ్ బృందం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి విజ్ఞప్తి చేసింది.

# కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ..



ప్రజావినికిడి,(జూబ్లీహిల్స్):జూలై 20

కళ్యాణ లక్ష్మి ,షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఎర్రగడ్డ డివిజన్ కు సంబంధించిన పలువురు మహిళలకు శనివారం జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. జూబ్లీహిల్స్ శాసనసభ్యులు అలాగే బిఆర్ఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మాగంటి గోపినాథ్ ఎర్రగడ్డ డివిజన్ కి సంబందించిన 34 మందికి ఒక్కొక్కరికి రూ. 100116 మొత్తం రూ. 34,03,944 విలువైన షాదీ ముబారక్ అలాగే కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బలనగర్ డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ జూనియర్ అసిస్టెంట్ విజయ్ కుమార్ అమీర్ పెట్ సీనియర్ అసిస్టెంట్ కిరణ్ కుమార్ జూనియర్ అసిస్టెంట్ కుమార్ స్వామిమరియు డివిజన్ ప్రెసిడెంట్ సంజీవ్, జనరల్ సెక్రటరీ సయ్యద్ షరీఫ్,షైక్ జావీద్,సయ్యద్ రసూల్,ముహిబ్ ఖాన్,దాసి శ్రీకాంత్, తరుణ్,అనిల్,బాలు, నరేష్,రాజు బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# చౌడమ్మగుట్ట శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో ఘనంగా పల్లకీ సేవ..

## దేవాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం..







ప్రజావినికిడి,(షాద్ నగర్):

రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపాలిటి పరిధిలోని సోలిపూర్ చౌడమ్మగుట్ట శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భజన భక్త బృందం సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారి పల్లకి సేవ వైభవంగా నిర్వహించారు. శ్రీ ఆంజనేయస్వామి విగ్రహాన్ని పల్లకిలో మోస్తూ శ్రీరామ జయరామ,జయ జయ రామ నినాదాలతో ఆట పాటలతో,భజనలతో భక్తులు పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. భక్తి పాటలు భజనలతో ఆలయంలో శ్రీరామ నామ స్మరణ మార్మోగింది. ఆలయ ప్రధాన అర్చకులు రఘుపతిరావు, రాఘవేంద్ర చార్య, అర్చకులు కృష్ణ, ప్రమోద్,సునీల్ పంతులు భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం భక్తులకు దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. దేవాలయ అభివృద్ధికి, అన్నదాన కార్యక్రమానికి సహకరిస్తున్న దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పులిమామిడి శ్రీశైలం గౌడ్,అన్నారం రఘు గౌడ్,గడ్డమీద రమేష్ ముదిరాజ్, రఘునందన్ రెడ్డి, లక్ష్మణ్,క్యాసెట్ శ్రీనివాస్,కిషన్ నాయక్,రాఘవేందర్, నారాయణ,వీర్లపల్లి కృష్ణయ్య,లక్ష్మికాంత్ రెడ్డి,కృష్ణ చారి, శంకరయ్య యాదవ్, వీఆర్వో బచ్చన్న, యాదగిరి,పి.ప్రవీణ్ గౌడ్,పద్మా వెంకటేష్, గోరియా నాయక్, కొత్త సత్తయ్య గౌడ్, శ్రీనివాస్,రమేష్, సుధాకర్ రెడ్డి, హనుమంత్ రెడ్డి, రవీందర్,మాజీ వార్డు సభ్యులు సింగపాగ లక్ష్మయ్య,భజన భక్త బృందం,మహిళలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

## బీజెవైఎం రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్

ప్రజావినికిడి, (ముషీరాబాద్):

ఏరు దాటే దాకా ఓడ మల్లన్న..ఏరు దాటాక బోడి మల్లన్న అన్న చందంగా నిరుద్యోగ యువత పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి తీరు మారిందని బీజెవైఎం రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్ ఆరోపించారు. తెలంగాణ నిరుద్యోగులకు మద్దతుగా బీజెవైఎం ఆధ్వర్యంలో ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద నిరుద్యోగ మహాధర్నా చేపట్టి నిరుద్యోగ యువత న్యాయమైన డిమాండ్లను రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశాను. ఈ ధర్నా కార్యక్రమంలో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి వర్యులు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి, బీజెవైఎం రాష్ట్ర అధ్యక్షులు మహేందర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ



గతంలో తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ కుటుంబం బీఆర్ఎస్ పార్టీ ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయకుండా నోటిఫికేషన్లు ఇవ్వకుండా తెలంగాణ యువతను వెన్నుపోటు పొడిచి మోసం చేసింది. నేడు ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ యూత్ డిక్లరేషన్ పేరుతో నిరుద్యోగులకు అనేక రకాల హామీలిచ్చి, అధికారంలోకి వచ్చాక మోసం చేసింది. 100 రోజుల్లో హామీలు నెరవేరుస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏ ఒక్కటీ అమలు చేయడం లేదని ధ్వజమెత్తారు. ఉస్మానియా విద్యార్థులను, నిరుద్యోగులను అవమానపర్చేలా ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడటాన్ని బీజెవైఎం ఖండిస్తోంది. 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నరు. ఎక్కడపోయాయి..? జాబ్ క్యాలెండర్ గురించి మర్చిపోయారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి అమలు చేయలేదు. నేడు రేవంత్ ప్రభుత్వం కూడా అమలు చేయడం లేదు. విద్యార్థులకు రూ. 5 లక్షల విద్యా భరోసా కార్డులు ఏవి..?. 18 ఏళ్లు నిండిన ప్రతి యువతికి ఎలక్ట్రిక్ స్కూటీ ఇస్తామని చెప్పి మాట తప్పారన్నారు.

మార్పు కోసం కాంగ్రెస్ అన్నారు. కాని, పాలనలో,తెలంగాణ ప్రజల జీవితాలలో మార్పు రాలేదు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలి. కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్యాయానికి గురవుతున్న, మోసపోయిన విద్యార్థులు, నిరుద్యోగులు, యువతకు అండగా బీజెవైఎం ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చేలా ఒత్తిడి తీసుకువచ్చేలా బీజెవైఎం పోరాటం చేస్తుందని బీజెవైఎం రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్ తెలిపారు.

# స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆధ్వర్యంలో....

## అట్టహాసంగా డాక్టర్ పిల్లోడి లక్ష్మయ్య పుట్టినరోజు వేడుకలు...






ప్రజావినికిడి, (హైదరాబాద్):జూలై 20,

పిఎల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ పిల్లోడి లక్ష్మయ్య పుట్టిన రోజు ముందస్తు వేడుకలు ఆదివారం అట్టహాసంగా జరిగాయి. తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సమక్షంలో పిల్లోడి లక్ష్మణ్ జన్మ దిన వేడుకలు అటహాసంగా జరిగాయి. ఇదిలా ఉండగా పిల్లోడి లక్ష్మయ్య పిఎల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు,ఏటిఏ జాతీయ కో-ఆర్డినేటర్ తెలంగాణ రాష్ట్ర విమెన్ రైట్స్ లెట్రిసి మిషన్ అధ్యక్షులు, ఉమెన్ రైట్ జస్టిస్ మూమెంట్ వికారాబాద్ జిల్లా అధ్యక్షులు, ఎన్సిడబ్ల్యూసి వికారాబాద్ జిల్లా అధ్యక్షులు,ఎస్ఎంసి తెలంగాణ రాష్ట్ర కో-ఆర్డినేటర్,పిపిసి రాష్ట్ర సలహాదారుడు, తెలంగాణ రాష్ట్ర పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర కో- ఆర్డినేటర్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కమిటీ రాష్ట్ర కో-ఆర్డినేటర్, తెలంగాణ ఉద్యమకారులు రాష్ట్ర కో-ఆర్డినేటర్ మాదిగ మేధావుల ఫోరం తెలంగాణ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ తెలంగాణ రాష్ట్ర ఎన్జీవోల రాష్ట్ర కో-ఆర్డినేటర్ చాలా ఎన్జీవోలకి డైరెక్టర్ గా ఉన్నారు కొన్ని ఎలక్ట్రానిక్ మీడియాకు డైరెక్టర్ గా ఉన్నారు అనేకరకాల పదవులు ఉన్నాయి. పిల్లలందరూ చదువుకోవాలి అనే ఒక నినాదంతో బాల్యం పిల్లల హక్కు పిల్లలు ఉండే చోటు పాఠశాలలే ఈనాటి పిల్లలే రేపటి పౌరులు అంటూ, మారుమూల గ్రామీణ ప్రాంతాలలో ఎంతో మంది పిల్లల్ని చేరదీసి వారిని భావి భారత పౌరులుగా తీర్చిదిద్దిన ఘనత పిల్లల కోసం బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కొరకై అనేకరకాల పాటలు రాసి చైతన్య గీతాలు ఈ గీతాలను పాడుతూ అందరినీ చైతన్యపరిచి పిల్లలందరూ చదువుకోవాలని ఎంతో తను చేసిన శ్రమ కష్టము, వృధా పోదు అనుకుంటున్నారు. అనేక రకాల అవార్డ్స్ సామాజిక కార్యకర్తగా తను చేసినటువంటి సేవలు ఎన్నో డాక్టరేట్ అవార్డ్స్ పొందుకోవడం జరిగింది. మదర్ తెరిసా పీవీ నరసింహారావు దళిత రత్న అవార్డు సావిత్రిబాయి పూలే మాక్ అసెంబ్లీలో హైదరాబాద్ లోని రవీంద్రభారతిలో రాజకీయవేత్తగా తను మాట్లాడిన ప్రసంగాన్ని అందరూ మంచి ప్రసంగీకుడు అంటూ ఘనంగా సన్మానం చేయడం జరిగింది జేబీ రాజు ఆధ్వర్యంలో కటికల శివ భాగ్య రావు డాక్టర్ ఆరేపల్లి రాజేందర్ ఎన్టిపిసి ఎండి ఘనంగా సన్మానం చేశారు. ఆయనకున్న ఆలోచన ఒకటి వీర్లపల్లి గ్రామము మర్పల్లి మండలం వికారాబాద్ జిల్లాలో రైల్వే స్టేషన్ నిర్మాణం చేయాలి అక్కడ రైలు ఆపాలి వీర్లపల్లికి ఆర్టీసీ బస్సు రావాలి అంటూ బండి సంజయ్ కి కిషన్ రెడ్డికి ఈటెల రాజేందర్ కి తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కి ఆంధ్రప్రదేశ్ బాపట్ల ఎంపీ టెన్నేటి కృష్ణ ప్రసాద్ మాజీ డిజిపి మాజీ ఎమ్మెల్యే ఆనంద్ కి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చంద్రశేఖర్ కి సబితా ఇంద్రా రెడ్డి కి వివేకానంద ఎమ్మెల్యే కి జిల్లా కలెక్టర్లకు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఏది ఏమైనా ప్రజల పక్షాన్ని నిలబడాలి ప్రజల కోసమే పని చేయాలని, పేద పిల్లలందరూ చదువుకోవాలని వారు చదువుకొని మంచి ప్రయోజకులు కావాలి నిరంతరంగా 35 సంవత్సరాల నుంచి తను చేస్తున్నట్టు సేవ బట్టి ఎందరో అభినందించారు. ఎన్నో అవార్డులు అందుకున్నటువంటి డాక్టర్ పిల్లోడి లక్ష్మయ్య పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులు స్వచ్ఛంద సంఘాలు కార్యకర్తలు కుటుంబ సభ్యులు ప్రముఖ సోషల్ వర్కర్ ఉప్పు సత్యనారాయణ, సీనియర్ జర్నలిస్ట్ ఇనాయత్ అలీ తదితరులు అభినందించారు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District - 500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State.
Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613

# భారత్ లో కోవిడ్ 19 మరణాలపై అంతర్జాతీయ నివేదికను ఖండించిన కేంద్రం

**హైదరాబాద్,జులై 20 ప్రజావినికిడి:**
కొవిడ్ 19 కారణంగా మన దేశంలో 11.9 లక్షల మంది మృతి చెందినట్లుగా వెలువడిన అంతర్జాతీయ నివేదికపై భారత ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కొవిడ్ సమయంలో భారత్‌లో నివేదించిన మరణాల కన్నా చాలా ఎక్కువగా చోటు చేసుకున్నాయని ఓ అంతర్జాతీయ అధ్యయనం ఇటీవల వెల్లడించింది. దీనిపై కేంద్ర ఆరోగ్య శాఖ స్పందించింది. ఈ అధ్యయాన్ని ఖండిస్తూ కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఓ ప్రకటనను విడుదల చేసింది. ఇది తప్పుదోవ పట్టించే నివేదిక అని పేర్కొంది. అధ్యయనం చేసిన అంచనాలు తప్పుదోవ పట్టించేవిగా ఉన్నాయని, లోపభూయిష్టమైన పద్ధతిలో వారు చేసిన అధ్యయనం ఆమోదయోగ్యం కాదని పేర్కొంది. ఎన్ఎఫ్‌హెచ్ఎస్ నుంచి సేకరించిన



సమాచారాన్ని మొత్తం దేశానికి ఆపాదించలేమని పేర్కొంది. దేశంలోని సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ అత్యంత విశ్వసనీయమైనదని పేర్కొంది.
దేశంలోని 99 శాతం మరణాలు ఇందులో రికార్డ్ అవుతాయని తెలిపింది. 2019తో పోలిస్తే 2020లో మరణాలు 4.74 లక్షలు పెరిగినట్లు తెలిపింది. అంతకుముందు రెండేళ్లలోనూ ఇలాగే పెరుగుదల నమోదైనట్లు తెలిపింది. 2018లో 4.86 లక్షలు, 2019లో 6.90 లక్షలతో మరణాల్లో అత్యధిక పెరుగుదల నమోదైందని వెల్లడించింది. అత్యధికంగా నమోదైన మరణాలన్నీ కోవిడ్ కారణంగానే అని చెప్పలేమని తెలిపింది. ఇతర ఆరోగ్య సమస్యలు కూడా ఉంటాయని వెల్లడించింది.
ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ సహా పలు విశ్వవిద్యాలయాలకు చెందిన పరిశోధకులు అధ్యయనం నిర్వహించారు. ఎన్ఎఫ్‌హెచ్ఎస్ నివేదికను విశ్లేషించి భారత్‌లో కరోనా విజృంభణ సమయంలో అత్యధిక మరణాలు చోటు చేసుకున్నట్లు నివేదికలో పేర్కొంది. ఈ కథనాన్ని కొన్ని మీడియా సంస్థలు ప్రచురించాయి. దీంతో కేంద్ర ఆరోగ్య శాఖ స్పందించింది.



# ప్రసాద పంపిణీ కార్యక్రమం..

ప్రజావినికిడి,(నాగోల్):గురు పూర్ణిమ సందర్భంగా నాగోల్ లోని శుభం కన్వెన్షన్ లో ఏర్పాటు చేసిన ప్రసాద పంపిణీ.. ఈ కార్యక్రమంలో ఎసిపి కృష్ణయ్య,సిఐ సుధీర్ కృష్ణ,ఎస్ఐ శ్రీనివాస్ ప్రసాద్ తో పాల్గొన్న ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల సురేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# డ్రగ్స్ విక్రయిస్తున్న ర్యాపిడో డ్రైవర్ల అరెస్టు

**హైదరాబాద్,జులై 20 ప్రజావినికిడి:**
వేర్వేరు కేసుల్లో డ్రగ్స్ విక్రయిస్తున్న ముగ్గురిని నిందితులను ఎల్‌బి నగర్ ఎస్ఓటి, సరూర్‌నగర్, మేడిపల్లి పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 44 గ్రాముల హెరాయిన్, రెండు బైక్‌లు, రెండు వేయింగ్ మిషన్లు, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం%ౌ%రాజస్థాన్ రాష్ట్రం, బార్మార్ జిల్లా, గూడమలానికి చెందిన రమేష్‌కుమార్, మహదేవ్ రామ్ ఇద్దరు ర్యాపిడో డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. విక్రం గోయల్, దినేష్ కళ్యాణ్ పరారీలో ఉన్నారు. రమేష్, మహదేవ్ అన్నదమ్ముళ్లు, ఇద్దరు 2022లో బతుకు దెరువు కోసం హైదరాబాద్‌కు వచ్చారు. ఇక్కడ రాజస్థాన్‌కు చెందిన విక్రం గోయల్‌లో కలిసి ఉంటున్నారు. ముగ్గురు హెరాయిన్‌కు బానిసలుగా మారారు. ర్యాపిడో డ్రైవర్లుగా చేయడంతో వస్తున్న ఆదాయం సరిపోకపోవడంతో సులభంగా డబ్బులు సంపాదించాలని ప్లాన్ వేశారు.రాజస్థాన్‌లో తక్కువ ధరకు హెరాయిన్ కొనుగోలు చేసి ఇక్కడ ఎక్కువ ధరకు విక్రయించాలని ప్లాన్ వేశారు. రాజస్థాన్‌కు చెందిన దినేష్ కళ్యాణ్ వద్ద గ్రాముకు రూ.6,000లకు కొనుగోలు చేసి నగరానికి తీసుకుని వచ్చి రూ.12,000లకు విక్రయిస్తున్నారు. ఏడాది నుంచి ముగ్గురు నిందితులు ఎన్‌వలప్‌లో హెరాయిన్ పెట్టి ర్యాపిడోలో అవసరం ఉన్న వారికి డెలివరీ చేస్తున్నారు. ఇటీవలే మహదేవ్ రాజస్థాన్‌కు వెళ్లి 30 గ్రాముల హెరాయిన్ కొనుగోలు చేసి నగరానికి తీసుకుని వచ్చాడు. ఐదురోజుల క్రితం రాజస్థాన్ వెళ్లిన విక్రం గోయల్ వెంటనే హెరాయిన్



విక్రయించాలని రమేష్, మహదేవ్‌కు చెప్పాడు. అతడి సూచనల మేరకు రెండు కవర్లలో డ్రగ్స్ పెట్టి విక్రయించేందుకు వెళ్తుండగా సరూర్‌నగర్, ఎల్‌బి నగర్ ఎస్ఓటి పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి 34 గ్రాముల హెరాయిన్, బైక్, రెండు మొబైల్ ఫోన్లు, వేయింగ్ మిషన్‌ను స్వాధీనం చేసుకున్నారు.మరో కేసులో హెరాయిన్ విక్రయిస్తున్న ఇద్దరు యువకులను ఎల్‌బి నగర్ ఎస్ఓటి, మేడిపల్లి పోలీసులు అరెస్టు చేశారు. రాజస్థాన్ రాష్ట్రం, జాలోర్‌కు చెందిన దినేష్‌కుమార్, బార్మార్ జిల్లాకు చెందిన దినేష్ కళ్యాణ్ అలియాస్ దినేష్‌కుమార్ అలియాస్ రాహుల్ భాయ్ అలియాస్ దినేష్ బిష్ణోయ్ అలియాస్ విక్రం భాయ్ అలియాస్ మలానీ కలిసి డ్రగ్స్ విక్రయిస్తున్నారు. దినేష్‌కుమార్‌ను అరెస్టు చేయగా, దినేష్ కళ్యాణ్ పరారీలో ఉన్నాడు. దినేష్‌కుమార్ బతుకు దెరువు కోసం 2013లో హైదరాబాద్‌కు వచ్చాడు. ఇక్కడ ఉంటూ రేయిలింగ్ పనిచేస్తున్నాడు. ఈ క్రమంలోనే దినేష్‌కుమార్‌కు దినేష్ కళ్యాణ్‌తో పరిచయం ఏర్పడింది. డ్రగ్స్ విక్రయిస్తే గ్రాముకు రూ.500 కమీషన్ ఇస్తానని దినేష్‌కుమార్‌కు దినేష్ కళ్యాణ్ చెప్పాడు. ఇద్దరు కలిసి నగరంలో డ్రగ్స్ అవసరం ఉన్న వారికి హెరాయిన్‌ను ఎన్‌వలప్‌లో పెట్టి ర్యాపిడోలో డెలివరీ చేస్తున్నారు. ఈ విషయం తెలియడంతో ఎల్‌బి నగర్ ఎస్ఓటి, మేడిపల్లి పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

# కర్నూలులో సినీనటి శ్రీరెడ్డిపై కేసు నమోదు..

**కర్నూలు జులై 20 ప్రజావినికిడి:**
కర్నూలు నగరంలోని మూడవ పట్టణం పోలీస్ స్టేషన్ పరిధిలో సినీనటి శ్రీరెడ్డి పై కేసు నమోదైంది. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, హోంమంత్రి అనితలను శ్రీరెడ్డి దూషించినట్లుగా కేసు నమోదయింది.



ముఖ్యమంత్రితో పాటు, మంత్రులపై సామాజిక మాధ్యమాల్లో శ్రీరెడ్డి అసభ్యకర కామెంట్స్ చేశారు. దీంతో మండిపడిన టీడీపీ నేత రాజుయాదవ్. మరికొందరితో కలిసి స్థానిక త్రీ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో ఆమెపై కేసు నమోదు చేసినట్లు సీఐ మహేశ్వర్ రెడ్డి తెలిపారు.

# భార్యకు సింగపూర్ వర్సిటీ పట్టా...

## పవన్ కల్యాణ్ ఆనందం...

**- సింగపూర్ వర్సిటీ నుంచి మాస్టర్స్ డిగ్రీ అందుకున్న అన్నా లెజినోవా**
**- సింగపూర్ లో స్నాతకోత్సవానికి హాజరైన పవన్ కల్యాణ్**
**- భార్య రెండో మాస్టర్స్ డిగ్రీ సాధించినందుకు అభినందనలు**

**జులై 20 ప్రజావినికిడి:**
ఏపీ ఉప ముఖ్యమంత్రి, జనసేనాని పవన్ కల్యాణ్ భార్య అన్నా లెజినోవా సింగపూర్ జాతీయ విశ్వవిద్యాలయం నుంచి ఎంఏ పట్టా అందుకున్నారు. ఆగ్నేయాసియా దేశాల కళలు, సామాజిక విజ్ఞానం సబ్జెక్టులో ఆమె మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశారు. అన్నా లెజినోవాకు ఇది రెండో మాస్టర్స్ డిగ్రీ. సింగపూర్ వర్సిటీలో నిర్వహించిన




స్నాతకోత్సవానికి భార్య అన్నాతో పాటు పవన్ కల్యాణ్ కూడా హాజరయ్యారు. మాస్టర్స్ పట్టా పొందినందుకు పవన్ ఆనందం వెలిబుచ్చారు. రెండో మాస్టర్స్ డిగ్రీ అందుకున్న భార్యకు అభినందనలు తెలిపారు. అన్నా లెజినోవా గతంలో రష్యాలోని సెయింట్ పీటర్స్ బర్గ్ స్టేట్ యూనివర్సిటీ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. ఓరియంటల్ స్టడీస్ లో ఆసియా దేశాల చరిత్ర, భాషలు, జీవన విధానంపై పీటర్స్ బర్గ్ వర్సిటీ నుంచి డిగ్రీ అందుకున్నారు. థాయ్ లాండ్ చరిత్ర సబ్జెక్టులో స్పెషలైజేషన్ చేశారు. రష్యా యూనివర్సిటీలో ఉన్నప్పుడే ఆమె మూడు భాషలు నేర్చుకున్నారు. ఇక, థాయ్ లాండ్ రాజధాని బ్యాంకాక్ లోని దులాలాంగ్ కార్న్ యూనివర్సిటీ నుంచి థాయ్ స్టడీస్ సబ్జెక్టుతో తొలి మాస్టర్స్ డిగ్రీ అందుకున్నారు.

# యూపీఐ పేమెంట్లకు ఎనలేని ఆదరణ..

## ప్రతినెలా ఆశ్చర్యకర స్థాయిలో కొత్త వినియోగదారులు

**ప్రతి నెలా జత కలుస్తున్న 60 లక్షల మంది నూతన యూపీఐ చెల్లింపుదార్లు**
**ఏడాది ప్రాతిపదికన 49 శాతం మేర పెరిగిన పేమెంట్లు**
**రోజువారీగా యూపీఐ చెల్లింపుల మొత్తం విలువ రూ.66,903 కోట్లు**
**గణాంకాలు విడుదల చేసిన ఎన్‌పీసీఐ**




**హైదరాబాద్,జులై 20 ప్రజావినికిడి:**
దేశవ్యాప్తంగా డిజిటల్ చెల్లింపులు అంతకంతకూ వృద్ధి చెందుతున్నాయి. ముఖ్యంగా యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్) పేమెంట్లకు ఎనలేని ఆదరణ పెరుగుతోంది. ప్రతి నెలా ఏకంగా 60 లక్షల మంది నూతన వినియోగదారులు యూపీఐ చెల్లింపులు మొదలుపెడుతున్నారని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) డేటా పేర్కొంది. ఈ మేరకు జూన్ నెల డేటాను ప్రకటించింది. ఏడాది ప్రాతిపదికన యూపీఐ లావాదేవీల సంఖ్య ఏకంగా 49 శాతం మేర పెరిగి 13.9 బిలియన్లకు చేరిందని తెలిపింది. ఇక లావాదేవీల విలువ 36 శాతం పెరిగి రూ.20.1 లక్షల కోట్లకు చేరిందని ప్రకటించింది.
రోజువారీ యూపీఐ లావాదేవీల సంఖ్య 463 మిలియన్లు ఉంటుందని, రోజువారీ పేమెంట్ల సగటు విలువ రూ.66,903 కోట్లుగా ఉంటుందని ఎన్‌పీసీఐ పేర్కొంది. యూపీఐపై రూపే క్రెడిట్ కార్డు చెల్లింపులకు అవకాశం ఇవ్వడం, విదేశీ దేశాలలో సైతం యూపీఐ సేవలను ప్రారంభించడంతో యూపీఐ చెల్లింపులు భారీగా పెరిగేందుకు దోహదపడింది. ఈ పరిణామంపై ఎన్‌పీసీఐ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ప్రవీణా రాయ్ స్పందించారు. రూపే క్రెడిట్ కార్డుల మార్కెట్ వాటా మూడేళ్ల క్రితం కేవలం 1 శాతంగా ఉండగా ఇప్పుడు 10 శాతానికి పెరిగిందని ప్రస్తావించారు.కాగా భారత్‌లో యూపీఐ చెల్లింపుల వ్యవస్థను అనేక దేశాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయి. ఈ మేరకు ప్రపంచ దేశాలకు భారత్ సహకారం అందిస్తోంది. ఇటీవలే యూఏఈలోని 'అల్ మాయా సూపర్‌మార్కెట్' దేశంలోని తన స్టోర్లలో యూపీఐ ఆధారిత చెల్లింపులను ప్రారంభించనున్నట్టు ప్రకటించింది. పారిస్‌లోని ఈఫిల్ టవర్ వద్ద కూడా యూపీఐ పేమెంట్లు అందుబాటులో ఉన్నాయని ఎన్‌పీసీఐ నాన్-ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్, స్వతంత్ర డైరెక్టర్ అజయ్ కుమార్ చౌదరి ప్రస్తావించారు. పారిస్ ఒలింపిక్స్ నేపథ్యంలో ఈ పేమెంట్లకు మరింత ఆదరణ పెరిగే అవకాశం ఉందన్నారు. రాబోయే సంవత్సరాల్లో రోజుకు 1 బిలియన్ యూపీఐ లావాదేవీలను సాధించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని ఆయన చెప్పారు.


# ప్రముఖ రచయిత జూకంటి జగన్నాథంను వరించిన దాశరథి కృష్ణమాచార్య అవార్డ్

**హైదరాబాద్,జులై 20 ప్రజావినికిడి:**
ప్రముఖ రచయిత, కవి జూకంటి జగన్నాథంను మరో అరుదైన పురస్కారం వరించింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జూకంటికి కవి దాశరథి కృష్ణమాచార్య పురస్కారం-2024ను ప్రకటిస్తూ శనివారం జీవో నెం.199 ను విడుదల చేసింది.రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి గ్రామంలో జన్మించిన జూకంటి కలం నుంచి జాలువారిన ఎన్నో రచనలు, కవిత్వాలు ఆహూతులను ఎంతగానో అలరించాయి. కవిత్వ సంకలనాలు, కథా సంకలనాలు రచనలో తనదైన విశేష ముద్ర వేసుకున్న జూకంటిని మొట్టమొదటి సారిగా వలస శీర్షికతో ఆంధ్రజ్యోతి వీక్లీ



దీపావళి పోటీలలో పాల్గొని ద్వితీయ బహుమతిని కైవసం చేసుకున్న ఆయన రచన ప్రస్థానంలో ఎన్నో మైలు రాళ్లను అధిగమించారు. సృజనాత్మక ప్రక్రియలకు తెలుగు విశ్వవిద్యాలయం 2002లో యూనివర్శిటీ ట్రస్టీ అవార్డును బహుకరించి, సాదరంగా సన్మానించుకుంది.ఆయన రచించిన కవిత్వం సంకలనాలు కన్నడ, తమిళ, హిందీ, ఆంగ్ల భాషల్లోనూ అనువాదానికే గాక, సాహితీ ప్రియుల అభిమానానికి నోచుకున్నాయి. దాశరథి కృష్ణమాచార్య జయంతి సందర్భంగా ప్రతిఏటా ప్రకటించే ప్రతిష్టాత్మక "శ్రీ దాశరథి కృష్ణమాచార్య అవార్డు" 2024 సంవత్సరానికి గాను జూకంటి జగన్నాథంకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ నిర్ణయం మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. అవార్డుతో పాటు 1 లక్షా 1,116 రూపాయల నగదు, జ్ఞాపికను అవార్డు గ్రహీతకు అందజేస్తారు. ఈ సందర్భంగా జగన్నాథం కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు శుభాకాంక్షలు తెలిపారు.

# నాగచైతన్య తండేల్ వాయిదా ?




టాలీవుడ్ మూవీ లవర్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్న తాజా ప్రాజెక్టుల్లో ఒకటి తండేల్ చందూమొండేటి దర్శకత్వంలో రొమాంటిక్ డ్రామా నేపథ్యంలో %చీజ%23 ప్రాజెక్టుగా తెరకెక్కుతున్న తండేల్‌లో అక్కినేని నాగచైతన్య హీరోగా నటిస్తున్నాడు. తండేల్‌లో సాయిపల్లవి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోందగా.. శ్రీకాకుళం అమ్మాయి సత్య పాత్ర పోషిస్తోంది. చైతూ అండ్ చందూమొండేటి టీం ఇప్పటికే లాంఛ్ చేసిన సత్య మేకింగ్ వీడియో నెట్టింట హల్ చల్ చేస్తోంది. ఈ చిత్రాన్ని డిసెంబర్ 20న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్టు ఇప్పటికే ప్రకటించారు మేకర్స్. అయితే తండేల్ విడుదల వాయిదా పడే అవకాశాలున్నాయంటూ ఓ వార్త నెట్టింట హల్ చల్ చేస్తోంది. దీనిక్కారణం డిసెంబర్ క్యూలైన్‌లో భారీ చిత్రాలుండటమేనన్న టాక్ వినిపిస్తోంది. అల్లు అర్జున్ నటిస్తోన్న పుష్ప ది రూల్, రాంచరణ్ గేమ్ ఛేంజర్, మంచు విష్ణు కన్నప్ప సినిమాలతోపాటు నితిన్ రాబిన్ హుడ్ కూడా డిసెంబర్‌లోనే రాబోతున్నాయి. ఇలా వరుస సినిమాలు లైన్‌లో ఉన్న నేపథ్యంలో తండేల్‌ను 2025 జనవరిలో లేదా ఫిబ్రవరిలో విడుదల చేసేలా ప్లాన్ చేస్తున్నారని తెగ చర్చ నడుస్తోంది. మరి ఈ విషయంపై మేకర్స్ నుంచి ఏదైనా క్లారిటీ వస్తుందేమో చూడాలి. 2018లో గుజరాత్ జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న తండేల్ ఈ చిత్రాన్ని గీతాఆర్ట్స్‌పై అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాసు తెరకెక్కిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. నాగచైతన్య-చందూ మొండేటి కాంబోలో రాబోతున్న మూడో సినిమా కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. ఇప్పటికే మేకర్స్ తండేల్ నుంచి లాంఛ్ చేసిన ఫస్ట్ లుక్‌లో చైతూ మత్స్యకారుడిగా మాస్ లుక్‌లో కనిపిస్తూ సినిమాపై సూపర్ బజ్ క్రియేట్ చేస్తున్నాడు.

## ఆ విషయంలో స్టార్ హీరోయిన్స్‌ను బీట్ చేసిన సాయి పల్లవి



సహజ నటి సాయి పల్లవి క్రేజ్ రోజు రోజుకు పెరిగిపోతుంది. ఈ ముద్దుగుమ్మ లు ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. మలయాళ ఇండస్ట్రీ నుంచి వచ్చిన సాయి పల్లవి తన నటనతో మన తెలుగమ్మాయిగా మారిపోయింది.సహజ నటి సాయి పల్లవి క్రేజ్ రోజు రోజుకు పెరిగిపోతుంది. ఈ ముద్దుగుమ్మ లు ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. మలయాళ ఇండస్ట్రీ నుంచి వచ్చిన సాయి పల్లవి తన నటనతో మన తెలుగమ్మాయిగా మారిపోయింది. వైవిధ్యమైన పాత్రలు చేస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. చాలా మంది హీరోయిన్స్ తమ గ్లామర్ తో ప్రేక్షకులను ఆకట్టుకుంటుంటే సాయి పల్లవి మాత్రం అలా కాకుండా పద్దతిగా నటిస్తూ అభిమానులను సొంతం చేసుకుంటుంది. ఎంపికలోనూ ఈ బ్యూటీ చాలాజాగ్రత్తలు తీసుకుంటుంది. కథ కథనంతో పాటు నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలు చేస్తూ లేడీ పవర్ స్టార్ గా పేరు తెచ్చుకుంది. తాజాగా స్టార్ హీరోయిన్స్ కు కూడా సాధ్యంకాని రికార్డ్ ను సొంతం చేసుకుంది సాయి పల్లవి. 10 సార్లు ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ కు నామినేట్ అయిన సాయి పల్లవి 6 సార్లు ఉత్తమ నటి అవార్డును గెలుచుకుంది. స్టార్ హెహీరోయిన్స్ త్రిష 5, నయనతార 5 అవార్డులు మాత్రమే గెలుచుకున్నారు. ఈ ఇద్దరిని సాయి పల్లవి బీట్ చేసింది. ఫిదా మొదలుకొని చివరిగా వచ్చిన విరాటపర్వం వరకు సాయి పల్లవి అద్భుతమైన నటనను కనబరిచినిది. ప్రస్తుతం ఈ బ్యూటీ తండేల్ అనే లో నటిస్తుంది. ఈ షూటింగ్ శరవేగంగా జరుగుతుంది.

## బాలీవుడ్ ఖిలాడీ మరోసారి ఫెయిల్..



బాలీవుడ్ ఖిలాడీ అక్షయ్ కుమార్ మరోసారి ఫెయిల్ అయ్యారు. సౌత్‌లో సూపర్ హిట్ అయిన కంటెంట్‌తో చేసిన మూవీ కూడా డిజాస్టర్ కావటంతో.. అక్కీ మార్కెట్ స్టామినా మీదే అనుమానాల మొదలయ్యాయి.ఓ డెబ్యూ హీరోకు రేంజ్‌లో కూడా అక్షయ్ పెర్ఫామ్ చేయలేకపోవటం.. దారుణం అంటున్నారు విశ్లేషకులు. బాలీవుడ్ స్టార్ హీరో అక్షయ్ కుమార్ సాలిడ్ హిట్ కొట్టి చాలా కాలం అవుతుంది.బాలీవుడ్ ఖిలాడీ అక్షయ్ కుమార్ మరోసారి ఫెయిల్ అయ్యారు. సౌత్‌లో సూపర్ హిట్ అయిన కంటెంట్‌తో చేసిన మూవీ కూడా డిజాస్టర్ కావటంతో.. అక్కీ మార్కెట్ స్టామినా మీదే అనుమానాల మొదలయ్యాయి.ఓ డెబ్యూ హీరోకు రేంజ్‌లో కూడా అక్షయ్ పెర్ఫామ్ చేయలేకపోవటం.. దారుణం అంటున్నారు విశ్లేషకులు. బాలీవుడ్ స్టార్ హీరో అక్షయ్ కుమార్ సాలిడ్ హిట్ కొట్టి చాలా కాలం అవుతుంది.కొద్ది రోజులుగా అక్షయ్ చేసిన లేవి ఆడియన్స్‌ను మెప్పించలేకపోతున్నాయి. కొన్ని లకు పాజిటివ్ టాక్ వచ్చినా.. వసూళ్ల పరంగా మాత్రం నిరాశపరుస్తున్నాయి.తాజాగా సర్ఫిరా విషయంలోనూ పరిస్థితి అలాగే ఉంది. సౌత్‌లో సూపర్ హిట్ అయిన ఆకాశం నీ హద్దురా ను హిందీలో రీమేక్ చేశారు అక్షయ్. సౌత్ వర్షన్‌ను డైరెక్టర్ చేసిన సుధా కొంగర హిందీ కు కూడా దర్శకత్వం వహించారు.సౌత్ లో హీరోగా నటించిన సూర్య, ఎంతో ఇష్టపడి హిందీ రీమేక్ స్వయంగా నిర్మించారు. ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన సర్ఫిరాకు పాజిటివ్ టాక్ వినిపిస్తోంది. రివ్యూవర్‌లు అద్భుతం అంటూ పొగుడుతున్నారు.అయినా కలెక్షన్లు మాత్రం పెద్దగా రావటం లేదు. ఒక్కో కు తన రికార్డ్‌ను తానే బ్రేక్ చేసుకుంటూ లీస్ట్ కలెక్షన్ల దిశగా పోతున్నారు ఖిలాడీ హీరో.

## స్పిరిట్ ఆలస్యం.. సెట్స్‌పైకి ప్రభాస్ ఫౌజీ?



టాలీవుడ్‌లో ప్రస్తుతం బిజీగా ఉన్న హీరో అంటే పాన్ ఇండియా స్టార్ అని చెప్పక తప్పదు. ఏడాదికి రెండు సినిమాలను విడుదల చేస్తున్నాడు ఈ స్టార్ హీరో. ప్రస్తుతం ప్రభాస్ చేతిలో సలార్ 2తో పాటు కల్కి పార్ట్, రాజా సాబ్, స్పిరిట్ చిత్రాలు ఉన్నాయి. ఈ సినిమాలు షూటింగ్ కంప్లీట్ చేయడానికి కనీసం ఇంకో సంవత్సరం అయిన పడుతుంది. అయితే ఈ సినిమాలతో పాటు ప్రభాస్ మరో టాలీవుడ్ దర్శకుడికి ఒకే చెప్పిన విషయం తెలిసిందే, పడి పడి లేచే మనసు, సీతారామం, అందాల రాక్షసి చిత్రాల ఫేమ్ హను రాఘవపూడితో 'ఫౌజీ' అనే మూవీ ఒకే చేశాడు ప్రభాస్. ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉండగా.. ఈ సినిమా అక్టోబర్ చివరి వారంలో లేదా, నవంబర్‌లో షూటింగ్ మొదలు పెట్టనున్నట్లు తెలుస్తుంది. యానిమల్ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ప్రభాస్ కాంబోలో వస్తున్న చిత్రం 'స్పిరిట్'. ఈ సినిమాను మొదట 2024 చివరిలో షూటింగ్ ప్రారభించనున్నట్లు చిత్ర దర్శకుడు ప్రకటించాడు. అయితే 'స్పిరిట్' ప్రీ ప్రొడక్షన్ పనులకు మరింత సమయం పడుతుందని తెలుస్తుంది. దీంతో ఈ ప్రాజెక్ట్ ఆలస్యం అవుతుండడంతో ఆ స్థానంలో 'ఫౌజీ' సెట్స్‌పైకి వెళ్లనున్నట్లు తెలుస్తోంది. ప్రతిష్టాత్మక మైత్రీమూవీమేకర్స్ నిర్మించనున్న ఈ సినిమాకు 'ఫౌజీ' అనే టైటిల్ అనుకుంటునట్టు తెలుస్తున్నది. ఫౌజీ అంటే సైనికుడు అని అర్థం. ఈ సినిమాలో ప్రభాస్ సైనికుడిగా కనిపించనున్నారట. అందుకే ఈ టైటిల్ బావుంటుందని బృందం భావిస్తున్నది. స్వాతంత్ర్యానికి పూర్వం జరిగే కథతో దర్శకుడు అను రాఘవపూడి ఈ సినిమాను తెరకెక్కించనున్నారట. బ్రిటీష్‌వారి సైనికుడిగా ఇందులో ప్రభాస్ కనిపించనున్నారట. ఇందులో కథానాయికగా మృణాళ్‌ఠాకూర్ ఖరారైనట్టు వార్తలు వస్తున్నాయి. విశాల్ చంద్రశేఖర్ ఈ సినిమాకు బాణీలు సమకూరుస్తున్నారు.

## రామ్ చరణ్‌కు అరుదైన గౌరవం..

### ఆస్ట్రేలియా ఫిలిం ఫెస్టివల్ నుంచి పిలుపు



మెగాస్టార్ చిరంజీవి వారసుడిగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టాడు రామ్ చరణ్.. తండ్రికి తగ్గ తనయుడు అనిపించుకోవడం నుంచి తండ్రికి మించిన తనయుడు అనిపించుకుంటున్నాడు. ఆర్ఆర్ఆర్ సినిమాతో టాలీవుడ్ నుంచి హాలీవుడ్ స్థాయి వరకు ఇమేజ్ ని పెంచుకుంటూ వెళ్లిన రామ్ చరణ్.. ప్రేక్షకుల చేత గ్లోబల్ స్టార్ అనిపించుకుంటున్నారు. ఇప్పుడు రామ్ చరణ్ కు మరో అరుదైన గుర్తింపు లభించింది. ఇప్పటికే తమిళనాడు యూనివర్సిటి నుంచి డాక్టరేట్ అందుకున్న రామ్ చరణ్ మరో అరుదైన ఘనతను అందుకున్నాడు. ఆస్ట్రేలియాలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్బోర్న్ వేడుకకు ముఖ్య అతిథిగా చరణ్ వెల్లనున్నాడు. ఈ విషయన్ని ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్బోర్న్ ఎక్స్ వేదికగా వెల్లడించింది. ఈ సంస్థ ఏర్పడి 15 సంవత్సరాలు కంప్లీట్ చేసుకుంటుంది. ఈ సందర్భంగా ఆగస్టు 15 నుంచి 25 వరకు వేడుకలు జరుపుకుంటుడగా.. ఈ ఈవెంట్‌కు రామ్ చరణ్‌ను ఆహ్వానించింది.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District - 500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State.
Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613